


## వేసవికాలంలో లోటులేకుండా ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా


# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 09 ఏప్రిల్, 2024 | పేజీలు : 05


## పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

మంత్రి సీతక్క





ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మంత్రి దానసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.సోమవారం రోజు ఆదిలాబాద్,నిర్మల్ పట్టణంలోని రత్న గార్డెన్,రెడ్డి ఫంక్షన్ హాల్ లో కంది శ్రీనివాస రెడ్డి,కే.శ్రీహరి రావు అధ్యక్షతన బూత్ లెవెల్ ఏజెంట్లు,కో ఆర్డినేటర్ల సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా పార్లమెంట్ ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించుకోవలసిన బాధ్యత మన ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే,ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత తనదే అన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించి లోక్ సభకు పంపిస్తే మన సమస్యలపై తన గళాన్ని వినిపిస్తుందన్నారు.అందుకే మన ముందున్న లక్ష్యం ఒక్కటేనని అది సుగుణను గెలిపించడమే అన్నారు.నాయకులు కార్యకర్తలు అంతా కార్య నిమగ్నులై లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేసారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్‌లో ఆశించిన స్థాయిలో అత్యధిక మెజార్టీ సాధించాలని పిలుపునిచ్చారు.పార్టీ అధిష్టానం డైరెక్షన్‌లో నడుస్తూ ప్రచారం చేపట్టాలని అన్నారు.సరికొత్త రికార్డు స్థాయిలో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పేర్కొన్నారు. నాయకులు,కార్యకర్తలందరూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్,ఆదిలాబాద్,బోథ్,నిర్మల్ నియోజక వర్గాల ఇంచార్జిలు కంది శ్రీనివాసరెడ్డి,ఆడె గజేందర్,అనిల్,డిసిసి అధ్యక్షులు శ్రీహర్రావు,నారాయణరావు పటేల్, విఠల్ రెడ్డి,బూత్ ఏజెంట్లు,కోఆర్డినేటర్లకు శిక్షణ నిచ్చేందుకు హైదరాబాద్ నుండి వచ్చిన పార్టీ ప్రముఖులు,జిల్లా ముఖ్యనాయకులు ఆదిలాబాద్,బోథ్, ఖానాపూర్,నిర్మల్ నియోజక వర్గాల బూత్ ఏజెంట్లు,కోఆర్డినేటర్లు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతు ప్రదానం



ప్రజాపక్షం/నేరడిగొండ : మండల కేంద్రంలోని పట్పటి తాండా గ్రామంలో నిర్వహించి పట్పటి తాండా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యాలయంలో పాల్గొని సోమవారం రోజున ఆటలో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్లో వదిలేసి క్రీడల వైపు మొగ్గచూపాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో షాపులో నానాక్ సింగ్ కార్యకర్తలు అభిమానులు లీడ తదితరులు ఉన్నారు.

# సీఎంఆర్ లక్ష్యం వెంటనే పూర్తి చేయండి

### నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నిర్దేశించిన లక్ష్యం మేరకు వానాకాలం కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు వెంటనే పూర్తి చేయాలని, ఈ మేరకు ఎఫ్‌సిఐ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఎఫ్‌సిఐ అధికారులు, రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను రైస్‌మిల్లర్స్ కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎఫ్‌సిఐ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యం మేరకు సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని, అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ మేరకు రైస్ మిల్లుల్లో పనిచేసే సిబ్బందిని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. గన్నీ సంచులతో కాప్రా పురుగు రాకుండా రైస్ మిల్లర్లు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కాప్రా పురుగు సోకకుండా సర్వీసు ప్రొవైడర్ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. వాటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చనిపోయిన కాప్రా కలిగిన బియ్యం బస్తాలను తీసుకునేందుకు అనుమతిస్తామని ఎఫ్‌సిఐ జిఎం తెలిపారని కలెక్టర్ వివరించారు. సీఎంఆర్ పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రెండు రోజులకోసారి సమీక్షిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జమ్మికుంట ఏరియాకు సంబంధించిన బియ్యం బస్తాలను నిల్వ చేసేందుకు హుజూరాబాద్ పరిసరాల్లో గోదాం ఏర్పాటు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే రైస్‌మిల్లర్లు నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు, నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎఫ్‌సిఐ ఏరియా మేనేజర్ విశాల్ గుప్తా మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్‌సిఐ గోదాముల్లో స్థల కొరత నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ ఏరియాలో మూడు పాట్ల 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ చేసేలా స్థలం కేటాయించాలని ప్రధాన కార్యాలయానికి లేఖ రాశామని పేర్కొన్నారు. గన్నీ సంచులతో వస్తున్న కాప్రా పురుగు నివారణపై రైస్‌మిల్లర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎదురవుతున్న ఇబ్బందులపై రైస్ మిల్లర్లు తమతో ఎప్పుడైనా చర్చించవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఎఫ్‌సిఐ మేనేజర్( ప్రొక్యూర్ మెంట్) రాజేంద్ర ప్రసాద్, డిసిఎస్‌వో గౌరీశంకర్, సివిల్ సప్లైస్ డీఎం రజనీకాంత్, ఏసిఎస్‌వో సురేష్, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు బోయినపల్లి ప్రభాకర్‌రావు, సుధాకర్‌రావు, కరుణాకర్, ఎఫ్‌సిఐ అధికారులు, గోదాం ఇంచార్జిలు, పలువురు అధికారులు, రైస్ మిల్లర్లు, తదితరులున్నారు.

### తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి : కలెక్టర్

కరీంనగర్ పట్టణంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఉజ్వల పార్కు సమీపంలో మంచి నీటి పంపింగ్ వ్యవస్థ, కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులను తాగునీటికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్‌లో తాగునీటి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? ఎప్పుడెప్పుడు నీటిని సరఫరా చేస్తున్నారు.. ఎంత పరిమాణంలో ఇస్తున్నారు అని కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు అధికారులు అదనంగా ఒక మోటార్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇందుకోసం కొత్తగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా తాగునీటిని సరఫరా చేయాలని మున్సిపల్ ధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కరీంనగర్‌లో తాగునీటికి కొద్ది నెలల వరకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఎల్‌ఎండి రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఎన్ని టీఎంసిల నీరు ఉందని అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ ఈఈ మహేందర్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టు స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ 202425 సంవత్సరానికి గాను సోమవారం నూతన అధ్యక్షులుగా గూడ ఎలిసే శాంతి భూషణ్, సెక్రటరీగా బోనగిరి భూమేష్, ట్రెజరర్‌గా మార బుచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన లయన్స్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## రంజాన్ పండుగ ఘనంగా జరుపుకోవాలి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : రంజాన్ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని మజీద్, ఈద్గా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న సౌకర్యాలను పరిశీలించి లైటింగ్ శానిటేషన్ త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని , తగినంత బ్లీచింగ్ చల్లాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ అన్నారు. అలాగే ప్రార్థన సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఈ పండుగను ముస్లిం సోదర సోదరీమణులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి అన్ని రకాల సౌకర్యాలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దుర్గయ్య, మన్సూర్ భాయ్, నీలం పెద్దులు పాల్గొన్నారు.

## ఈద్గా మైదానంలో పారిశుద్ధ్య పనులు



ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణ పరిధిలో వెంకట్‌రావుపేట్‌లో సోమవారం మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా మైదానంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మోహన్ మాట్లాడుతూ ఈద్గా మైదానంలో, పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. పవిత్ర రంజాన్ పండుగ రోజు త్రాగునీరు ఏర్పాటు చేయాలని, నమాజ్‌కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సానిటరి ఇన్స్‌పెక్టర్ గుర్రం రత్నాకర్, ముజీబ్, నర్సయ్య, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజనం వర్కర్ల వేతనాలు చెల్లించాలి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : మధ్యాహ్నం భోజనం వర్కర్స్ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సోమవారం కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటియుసి అనుబంధ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్న మహేష్ ఆధ్వర్యంలో కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు, పెండింగ్ బిల్లులు, అల్పాహారం బిల్లులు వేతనాలు అన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందని చెబుతూ వెంటనే అందించి వంట కార్మికులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ముక్రం, వెన్న మహేష్, లక్ష్మీ, సుగుణమ్మ, గౌతమి, లతా, శారద, జమునలు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు



ప్రజాపక్షం / హుజురాబాద్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టిఎస్ఓ) పరీక్షలో హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య కరికులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాట్ల సందీప్ కుమార్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు 315 మంది ఒలంపియాడ్ పరీక్షలు రాయగా,271 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు పొందారు. జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో పచ్చిమట్ల అనన్య, రెండవ స్థానంలో గూడూరి ఆశిష్ రెడ్డి, మూడవ స్థానంలో పిపాస మండల్, ఐదో స్థానంలో బొక్కల నవనీత్ రెడ్డిలు నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్, బహుమతులు, సర్టిఫికేట్లు సాధించారు. ఐఎన్‌టిఎస్ఓ వారు పంపించిన బహుమతులు సోమవారం ప్రిన్సిపాల్ మాట్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఈ ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజిఎం ముద్రకోల రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ మంద శ్రీనివాస్, ప్రైమరీ ఇంచార్జీ తిరుమల, ఒలంపియాడ్స్ ఇంచార్జులు రజనీకాంత్, చామంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తి వినోద్ కుమార్



ప్రజాపక్షం/కొత్తపల్లి : కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తి వినోద్ కుమార్ అని ఆయన భార్య డాక్టర్ మాధవి అన్నారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాల ఉపాధిహామీ కార్మికుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో వినోద్ కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బోయినపల్లి మాధవి మాట్లాడుతూ వినోద్ కుమార్ 2014 నుంచి 2019 వరకు పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన రోజుల్లో చేసిన పనులను వివరించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ, ఐదు జాతీయ రహదారులు, మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి రైల్వేలైన్, సైన్స్ సెంటర్, మానేరు రివర్ ఫ్రంట్, తీగలవంతెన, పద్మనగర్ నుంచి ఒద్యారం వరకు డబుల్ రోడ్డుతో పాటు సెంటర్ లైటింగ్, ఐటి హబ్ తీసుకొచ్చిన నాయకుడు వినోద్ కుమార్ అని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కరీంనగర్ అభివృద్ధి చెందాలంటే పని చేసే వినోద్ కుమార్ లాంటి వారిని గెలిపించాలని, వారు గెలిస్తే నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు ఇప్పించే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తీసుకువచ్చి యువకులకు ఉద్యోగల కల్పనకు దోహదపడుతుందన్నారు. జిల్లాకు నవోదయ కేంద్రం, ఐఐటి కాలేజీ, ట్రిబుల్ ఐటి కాలేజ్ తీసుకురావడానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్మికులు తమ సమస్యలను వివరిస్తూ ఉపాధి హామీ కార్మికులకు ప్రతివారంలోనే వేతనాలు పడే విధంగా చూడాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచాలని, పనిచేసే చోట కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తపల్లి మండల వైస్ ఎంపిపి భూక్య తిరుపతి నాయక్, బిఆర్ఎస్ నాయకులు లత, మల్లేశం, రాము తదితరులున్నారు.

## రైతు రుణమాఫీ ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుంది



ప్రజాపక్షం / మల్లాపూర్ : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తుందని ఇందులో భాగంగానే రైతు రుణమాఫీ అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్యాంక్ అధికారులతో చర్చలు జరుపుతున్నారని, తొందరలోనే రైతులకు తీపి కబురు అందుతుందని టిపిసిసి నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్‌లకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. గతంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని దొంగ హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత రైతులను నట్టేట మోసం చేశారని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని రైతుల కోసం దర్నాలు చేస్తున్నట్లు కపట ప్రేమను చూపుతున్నారని అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మాజీ జెడ్పిటిసి సభ్యుడు ఎల్లాల జలపతి రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సేవాదళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లయ్య, భూమయ్య, ఆనంద్, రమేష్, రాజం, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకునేలా ఉజ్వల పార్కు తీర్చిదిద్దండి



గార్డెన్, మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం చేయకండి

కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : పర్యాటకులను ఆకట్టుకునేలా ఉజ్వల పార్కును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యాటక శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఉజ్వల పార్కును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో కలియ తిరిగారు. ఉజ్వల పార్కు నిర్వహణ తీరు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహ్లాదం కోసం వచ్చే పర్యాటకుల కోసం పార్కును అందంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని రకాల మొక్కలు, గార్డెన్ సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని, సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారని, ఈ మేరకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆదరణ పెరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు మొక్కలు, ఫౌంటేన్ల వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. వాటర్‌షూట్‌ను పరిశీలించారు. పార్కులో ఉన్న జగన్నాథ ఆలయాన్ని జిల్లా కలెక్టర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సిబ్బంది పాల్గొన్నారు.



## గొర్రెల షెడ్డుకు నిప్పంటించిన వారిని వెంటనే శిక్షించాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని భర్తీపూర్ గ్రామంలో భూమాల దేవన్న అనే గొర్రెల కాపరి యొక్క గొర్రె షెడ్డును శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ దాడిలో 25గొర్రెల వరకు అస్వస్థతకు గురయ్యాయి. సుమారుగా రెండు లక్షల రూ.ల వరకు ఆస్తి నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షులు రెబ్బటి రాజశేఖర్ యాదవ్ సంఘటన స్థలానికి పరిశీలించి దేవన్న కుటుంబానికి ధైర్యం చెప్పి నిందితులను పట్టుకునేంతవరకు తన వంతు కృషి చేస్తానని అన్ని వేళల్లో అండగా ఉంటానని పేర్కొన్నారు. ఎవరైతే ఈ ఘాతుకానికి పాల్పడ్డారో వారిని పోలీసులు వెంటనే గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుని దేవన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ నాయకులు రెబ్బసి మధు యాదవ్, గట్టు వేణు యాదవ్, తీపిరి అశోక్ కుమార్, గుంటి నరేందర్, పుల్ల గంగాధర్, రాజేందర్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తైబజారు రుసుము చెల్లించాలి



ప్రజాపక్షం/కోరుట్ల : 2024/25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజారు వేలం నిర్వహించారు. తైబజారు గుత్తేదారునకు కాయగూరలు అమ్మేవారు చిరువ్యాపారులు రోజువారీగా రసీదు పొందుతూ చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా 7వ తేదిన గుత్తేదారుతో, మున్సిపల్ అధికారులతో వాగ్విాదానికు దిగి తైబజారు రుసుము చెల్లించామని రైతులకు, కూరగాయలు అమ్మేవారికి కనీస అవసరాలైన మరుగుదొడ్లు , త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి మార్కెట్‌ను సందర్శించి కూరగాయలు అమ్మేవారితో మాట్లాడి అక్కడే ఉన్న మహిళ మరుగుదొడ్లు శుభ్రపరిచి వాడుకలోకి తెచ్చారు. మార్కెట్ ప్రాంతంలో ఉన్న ఓఆర్ఎస్ వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచి త్రాగునీటి సౌకర్యం కల్పించారు. రైతులు, కూరగాయలు అమ్మేవారు చిరువ్యాపారస్తులకు కావలసిన ఏర్పాట్లు చేసినందున తైబజారు బిల్లు ఖచ్చితంగా చెల్లించి రశీదు పొందాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి రైతులను కోరారు.

## జ్ఞానోదయ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో ఉగాది వేడుకలు



ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో సోమవారం జ్ఞానోదయ డిగ్రీ అండ్ పిజి కళాశాల ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిపారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ముందస్తుగా కాలేజీ ఆవరణలో ఉగాది పండుగ ప్రత్యేక పూజలు చేసి అనంతరం విద్యార్థిని విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాలేజీలో ముందస్తు ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు తెలుగు సంప్రదాయం ప్రకారం ఉగాది వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు...



ప్రజాపక్షం/కోరుట్ల : ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలందరికి త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ , జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఆదేశాలు జారీచేశారు. అందువలన కోరుట్ల పట్టణంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. టోల్‌ఫ్రీ 18004254346, హెల్ప్ లైన్ నంబర్ 08725299961ల ద్వారా ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పట్టణ ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడితే వెంటనే పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదులకు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వారి యొక్క సమస్యలను పరిష్కరించాలి.

# ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/జైనూర్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను వినియోగించుకోవాలని వైద్య అధికారులు జితేందర్ రెడ్డి, రాజులు అన్నారు. సోమవారం మండలంలోని ఉషేగావ్ ప్రభుత్వ ఆసుపత్రిలో 49 మంది రోగులకు కుష్టి వ్యాధి నిర్ధారణ స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్ధారణ స్కానింగ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాల మేరకు ఈ శిబిరాల నిర్వహించడం జరిగిందని తెలిపారు. వైద్య ఉద్యోగులు గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్ధారణ పై దృష్టి సారించాలని, ఎవరికైనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించాలని కోరారు.

# కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి ఎంఎల్ఏ ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లా మాదారంకు చెందిన సుశ్రిత అనే కిక్‌బాక్సింగ్ క్రీడాకారిణికి సోమవారం మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 15 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. సుశ్రిత అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి జిల్లా, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొందుకు ఈ ఆర్థికసహాయంను ఎమ్మెల్యే కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించడం వల్ల వారి ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతో పాటు వారి ద్వారా మరింత మంది క్రీడాకారులను ప్రోత్సహించినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌లను బంద్ చేయండి



## కాల్వ శ్రీ రాంపూర్ గ్రామస్తుల డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్ లను వెంటనే రద్దు చేయాలని కాల్వ శ్రీరాంపూర్ గ్రామస్తులు , రైతులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని,కిష్టంపేట, మిర్జంపేట, మొట్లపల్లి గ్రామంలో ప్రభుత్వం ఇసుక రీచ్లకు అనుమతి ఇవ్వగా ఇసుక రీచ్ లను రద్దు చేయాలని,ఇసుక రీచ్ ల వల్ల భూగర్భ జలాలు ఎండిపోయి తాగునీటి సాగునీటి కష్టాలు ఏర్పడతాయని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్ లను వెంటనే రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మానేరు వాగు పరివాహక రైతులు గ్రామస్తులు ఉన్నారు.

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం మనువాదాన్ని మట్టు బెడదాం

## మహనీయుల స్ఫూర్తితో మతోన్మాద బిజెపిని ఓడిద్దాం



**ప్రజాపక్షం/మంచిర్యాలప్రతినిధి :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బిసి భవన్‌లో కెవిపిఎస్, టిఎజిఎస్ వృత్తిదారుల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని రక్షించుకుందాం మనువాదాన్ని మట్టు బెడదాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి నేటి వరకు దళితులపై, మహిళలపై రోజు రోజుకు దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయి అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రం అయినటువంటి గుజరాత్ రాష్ట్రంలో ప్రదీప్ రాథోడ్ అనే యువకుడు గుర్రం ఎక్కాడని కిందపడేసి కొట్టి చంపారని, మణిపూర్‌లో ఇద్దరు ఆదివాసి గిరిజన మహిళలను బట్టలూడదీసి నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారన్నారు. ఆర్‌ఎస్ఎస్ కనుసన్నలలో బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. 3 వేల కిందటి మనస్మృతిని ప్రాచీన భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్ట చూస్తుందని, బిజెపి అగ్ర నాయకులు మాట్లాడుతూ 400 సీట్లు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బహిరంగంగా చెప్పడం అంటే పూర్తిగా రాజ్యాంగాన్ని రద్దు చేయడానికే పెద్ద ఎత్తునకుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాబోయే లోక్ సభ ఎన్నికలలో మతోన్మాద పార్టీ బిజెపిని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక కన్వీనర్ ఆర్. రాజేశం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సుధీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకే రవి, దళిత ఉద్యమ నాయకులు దేవి పోచం, కనకరాజు, సమతా సైనిక రాష్ట్ర నాయకులు దుర్గం సిద్ధార్థ, రామ్మూర్తి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, బహుజన నాయకులు దుర్గం స్వామి, వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు బొడెంకి చందు, రాములు, కెవిపిఎస్ జిల్లా నాయకులు మంజూరు గోపి, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పుట్ట మధుకర్, దేవనపల్లి మధుకర్, కారం కిష్టంరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ చొరవతో మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాతా శిశు ఆసుపత్రి గోదావరి నది తీరంలో నిర్మించడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను గుర్తించి ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత మాతా శిశు ఆసుపత్రిలో మంచిర్యాల నడిబొడ్డున ఐబిలో నిర్మాణం చేపడుతానని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడంలో భాగంగా మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నూతన మాతా శిశు ఆసుపత్రి నిర్మాణానికి సోమవారం అడుగులు వేయించారు. గోదావరి నది బ్యాక్ వాటర్‌తో వర్షాకాలంలో మునిగి పోవడంతో ఐబి స్థలంలో మాతా శిశు ఆసుపత్రి నిర్మించాలని సంకల్పించి అనుకున్నట్లుగానే సోమవారం ఎస్ఎస్ఐపిసిపిఎల్ సీనియర్ ఇంజనీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అధికారులతో పాటు ఐబి స్థలంలో నవీన పద్ధతులలో బావి తరాలకు అనువుగా సకల సౌకర్యాలతో కూడిన మాతా శిశు ఆసుపత్రి భవనం నిర్మించాలని ఆదేశించారు. ఆర్డిఓ, రహదారుల భవనాల శాఖ, విశ్రాంతి భవనంలను మరోచోటుకు తరలించి ఆ భవనాలు ఆసుపత్రి నిర్మాణంకు స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అప్పటి అధికారులు ఆనాలోచిత నిర్ణయం వల్ల ఐబి స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం చేపట్టారని ప్రేంసాగర్ రావు ఎన్నికల ముందే తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మార్కెట్ నిర్మాణ దశలో ఉన్న వాటిని కూల్చివేసి ఆ స్థలంలో మాతా శిశు ఆసుపత్రిని నిర్మిస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. మార్కెట్ నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసి ఆ స్థలంలో ప్రజలకు అందుబాటులో ఉండేవిధ,గా మాతా శిశు ఆసుపత్రి నిర్మించాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడంలో ఆ దిశగా అధికారులు కూడా అడుగులు వేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రానికి వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చే బాలింతలు, పిల్లల సమస్యలు తీరనున్నాయి.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి




కరీంనగర్ టౌన్ ఏసిపి నరేందర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ మెమోరియల్ హాలులో ఆటో డ్రైవర్లకు పాటించాల్సిన నియమాలపై ట్రాఫిక్ పోలీసులు, స్థానిక ఇన్స్‌పెక్టర్‌ల సమన్వయంతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కరీంనగర్ టౌన్ ఏసిపి నరేందర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమ వృత్తిని నిర్వర్తించాలన్నారు. ప్రతి ఆటో నెంబర్‌తో పాటుగా పోలీసులు జారీ చేయు టాప్ నంబర్లు విధిగా కలిగి ఉండాలన్నారు. లేనివారిపై చర్యలు తప్పవన్నారు. ఆటో యజమానులు వారి ఆటోను నేర చరిత గల వారికి డ్రైవర్‌గా కిరాయిలకు ఇవ్వకూడదన్నారు. ఎవరైనా ఉల్లంఘించి పట్టుబడితే డ్రైవర్‌తో పాటు యజమానులపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రయాణికుల భద్రతే ముఖ్యమన్నారు. ఇటీవల జరిగిన రెండు నేరాల్లో ఆటో డ్రైవర్లు బాధ్యులుగా ఉన్నారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అంతే కాకుండా ఎక్కువ రద్దీ ఉండే ప్రదేశాల్లో ప్రయాణికులకు, ఇతర వాహనదారులకు , ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్డుపై విచ్చలవిడిగా ఆటోలను నిలుపుతున్నారని, వెంటనే వాటిని కట్టడి చేసేలా చర్యలు చేపట్టామని, నిర్దిష్ట ఆటోస్టాండుల్లో మాత్రమే ఆటోలను నిలుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు ఖరీముల్లా ఖాన్, వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ సరిలాల్, ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ తాగునీరు అందిస్తాం

**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలందరికీ తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 వరకు పట్టణ ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబర్లకు 9553331187, 9550357732 ఫిర్యాదు చేయాలని అన్నారు. వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

# నిర్మాణ పనులు ఆపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిర్మాణ పనులను వెంటనే ఆపాలని అడిషినల్ కలెక్టర్‌కు బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా కెంచె శేఖర్ మాట్లాడుతూ కొత్తపెల్లి పట్టణంలోని సర్వే నెంబర్ 127,128లో ఉన్న వ్యవసాయ క్షేత్ర ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు 8 ఎకరాల ప్రభుత్వస్థలాన్ని ఆదరాబాదరాగా కేటాయించిందన్నారు. కేవలం మైనార్టీల ఓట్ల కోసమే భూకేటాయింపు జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు వత్తాసు పలుకుతూ ఎన్నికల్ కోడ్ అమలులో ఉండగా నిర్మాణ పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పనులను వెంటనే ఆపాలని విజ్ఞప్తి చేశారు. రేకుర్తి ఈద్గాకు కేవలం ఒక కిలోమీటర్ పరిధిలో స్థలాన్ని కేటాయించడం వల్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని స్థానిక అవసరాలకు వినియోగించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కెంచె శేఖర్, నరేష్, వీరేశం, శ్రావణ్, శ్యాంసుందర్, ప్రవీణ్, శేఖర్, స్వామిరెడ్డి తదితరులున్నారు.

# నకిలీ విత్తనాలు అరికట్టాలి



**ప్రజాపక్షం/జమ్మికుంట :** వ్యవసాయ అధికారుల అండతో నకిలీ విత్తనాల చెలామణి మూడు పూవులు ఆరుకాయలుగా దందా కొనసాగుతోందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెలుపూరి రాములు ఆరోపించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి లేని విత్తనాలను రాష్ట్రంలో, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విపరీతంగా సరఫరా అవుతున్నాయని, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అనుమతి లేని బిటి3 నకిలీ పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతోందని, దీని వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ శ్వాస కోశ, కిడ్నీల వాపు, నరాల సంబంధిత, రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరికట్టాల్సిన అధికారులు చర్యలకు పూనుకోకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నకిలీ విత్తనాల దందాను అరికట్టకపోతే ప్రత్యక్ష పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# 10న చలో సిరిసిల్ల దీక్ష విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/చొప్పదండి :** రాష్ట్ర ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలకు సంబంధించిన నేతన్నలకు రావాల్సిన 270 కోట్ల రూపాయల బకాయిలు వెంటనే చెల్లించాలని కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఈ నెల 10న సిరిసిల్ల పట్టణ కేంద్రంలో తలపెట్టే చలో సిరిసిల్ల దీక్షను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మి నారాయణ కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యార్న్ సబ్సిడీ వెంటనే అందించాలని, గతంలో మాదిరిగానే విద్యుత్ బిల్లులకు సంబంధించి 50 శాతం సబ్సిడీని పునరుద్ధరించి కొత్త ఆర్డర్లను అందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలు ఆదుకోవాలని, అర్ధాంతరంగా నిలిచిపోయిన వర్క్ టు ఓనర్ పథకాన్ని కొనసాగించాలని దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు నేతన్నలు, ప్రజాసంఘాలు, బిజెపి నాయకులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కొమురంభీం జిల్లాలో భారీ వర్షం



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** భానుడి భగభగలతో అల్లాడుతున్న కొమురంభీం జిల్లా వాసులను వాన జల్లులు పలకరించాయి. సోమవారం సిర్పూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడిలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. మరోవైపు తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లటి కబురు తెలిపింది. మరో మూడు రోజుల వరకు జిల్లాలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు భానుడి వేడి నుండి ఉపశమనం దొరికిందని ఊపిరి పీల్చుకున్నారు.

## విద్యా కమిటీ చైర్మన్‌గా చిగురు స్రవంతి

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ అమ్మ ఆదర్శ విద్యా కమిటీ చైర్మన్ గా చిగురు స్రవంతి ఎన్నికయ్యారు. ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా సోమవారం ఆమెను ఎన్నుకున్నారు.

## ఓటరు నమోదు దరఖాస్తుకు ఈనెల 14 తుది గడువు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 14 తుది గడువని పెద్దపల్లి పార్లమెంటరి నియోజకవర్గం పెద్దపల్లి శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ బి.గంగయ్య సోమవారం తెలిపారు. ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరును సరిచూసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు లేని పక్షంలో ఏప్రిల్ 14 లోగా ఎన్.వి.ఎస్.పీ పోర్టల్, ఓటర్ హెల్ప్ లైన్ పోర్టల్, ఫారం 6 నింపి ఏప్రిల్ 14 లోగా సంబంధిత బూత్ స్థాయి అధికారికి దరఖాస్తు అందజేసి ఓటు హక్కు పొందాలని పేర్కొన్నారు.

## మంత్రిని సన్మానించిన జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు

**ప్రజాపక్షం/రామగిరిపెద్దపల్లి :** జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు రామగిరి లావణ్య సోమవారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును శాలువాతో ఘనంగా సన్మానించారు. పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, రాబోయే పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేయాలని లావణ్య కు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో మంథని వాసి మృతి

**ప్రజాపక్షం/మంథని :** హైదరాబాద్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో మంథనివాసి మృతి చెందాడు. మంథని మున్సిపల్ పరిధిలోని రావులచెరువుకట్టకు చెందిన వెలకంటి మారుతి అనే యువకుడు ప్రాణాలుకోల్పోయాడు. మారుతి గత కొద్ది సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మారుతి మృతి చెందాడు. కాగా మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటి పోయాయి.

## జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఫహాద్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఫహాద్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంధర్బంగా ఫహాద్ మాట్లాడుతూ జిల్లాలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, యూత్ కాంగ్రెస్ ఇంచార్జి కృష్ణ అల్లువారి, ప్రెసిడెంట్ బి.వి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి సురభి, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, కార్యదర్శి రమేష్ బాబు, ఇంచార్జి ఖలీద్ అహ్మద్‌ల నాయకత్వంలో యూత్ కాంగ్రెస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని తెలిపారు. ఈ సంధర్బంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలియజేశారు.

## అవయవాల దానమ్ గొప్పదానం



**ప్రజాపక్షం/ముత్తారం :** మరణాంతరం ఎంతో విలువైన అవయవాలు మట్టిలో కలిసిపోనివ్వకుండా మరొకరి దానం చేయడం అన్నింటికంటే గొప్ప దానమని, నేత్రదానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన ముత్తారం లక్కారం గ్రామానికి చెందిన బర్ల రాజమ్మ అందరికీ స్ఫూర్తిగా నిలిచారని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్పూర్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ కొనియాడారు. ఆదివారం రాజమ్మ సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ లయన్స్ క్లబ్ ఆ ఫ్ కమాన్పూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో రాజమ్మ మృతి చెందగా, సాంరాం గార్డెన్ అయిలి మధు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ శ్రీనివాస్ మృతురాలి నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో స్పందించి నేత్రాలను దానం చేసిన మృతురాలి భర్త రాజయ్య, కుమారులు లింగయ్య, సదానందంలకు ప్రోత్సహించిన శ్రీనివాస్ ను నల్లవెల్లి శంకర్ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం నేత్ర, అవయవ శరీర దానాలపై లింగమూర్తి అవగాహన కల్పించారు. నేత్రదాతకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేత్రదాత కుటుంబ సభ్యులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్తారం మాజీ ఎంపీపీ అత్తి చంద్రమౌళి చేతుల మీ దుగా సదాశయ అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేత్రదాత కుటుంబ సభ్యులన లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ జాతీయ అ ధ్యక్షులు శ్రవణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి భీష్మాచారి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రాజమౌళి, సలహాదారులు నూక రమేష్, సభ్యులు బండ్ల రవీందర్, ఐలి మధు అభినందనలు తెలిపారు.

## కరెంటు మోటార్ల దొంగ ను పట్టుకున్న పోలీసులు




### 20 మోటార్లు స్వాధీనం.. పోలీసులను అభినందించిన ఏ.సి.పి. కృష్ణ

**ప్రజాపక్షం / సుల్తానాబాద్ :** గత కొన్ని సంవత్సరాలుగా కరెంట్ మోటార్ల దొంగతనం చేస్తున్న వ్యక్తి నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు , సోమవారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏ.సి.పి గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు, కొత్తపల్లి మిర్జాంపేట గ్రామానికి చెందిన గోపు సంపత్ అనే వ్యక్తి సుతారి పని చేస్తూ జీవనం సాగించే వాడని, జల్సాలకు అలవాటు పడి, డబ్బులు సరిపోక పోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డారని, గత ఎన్నో సంవత్సరాలుగా వివిధ రకాల దొంగతనాలకు పాల్పడ్డారనీ,ఈ వ్యక్తి పై ఇప్పటి వరకు16 కేసులు ఉన్నాయని వివరించారు. ఆదివారం రోజు మధ్యాహ్నం గుంపుల బ్రిడ్జి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పోలీసులను చూసి ద్వి చక్ర వాహనం ఎక్సెల్ పై పారిపోతుంటే అనుమానించి న పోత్కపల్లి పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా దొంగతనం విషయాలు తెలిసాయనీ తెలిపారు, ,రైతులు మానేరు వాగు ఎస్సారెస్పీ కాలువల మీద బావులకు అమర్చుకున్న కరెంటు మోటార్లను రాత్రి వేళల్లో దొంగిలించి తన ఇంట్లో పెట్టుకునే వాడని, డబ్బులు అవసరం ఉన్నపుడు మోటార్లు, జమ్మికుంట, వరంగల్ పట్టణాల్లో అమ్మేవాడనీ,ఏ సి.పి తెలిపారు.దొంగలించిన 20 కరెంటు మోటార్లు,ఒక టీ.వీ.ఎస్. ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు,నేరస్తులను పట్టుకోవడంలో కృషి చేసిన సుల్తానాబాద్ సి.ఐ.జి.సుబ్బా రెడ్డి, పోత్కపల్లి ఏస్.ఐ.జి. అశోక్,ఏ.ఎస్.ఐ లు తిరుపతి, హెచ్.సి.రత్నాకర్, హెచ్.సి నల్లవెల్లి సుధాకర్, పి.సి.రాజేందర్ పెద్దపల్లి ఏ.సి.పి కృష్ణ అభినందించారు.

## మంత్రి చొరవతో నిధులు మంజూరు

**ప్రజాపక్షం/ముత్తారం :** మంత్రి శ్రీధర్ బాబు చొరవతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుండే రాజేందర్, తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుండే రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 100 రోజుల్లోనే మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందని మచ్చుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు దుండే రాజేందర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. గత ప్రభుత్వంలో మచ్చపేట గ్రామ శివారులోని బహుగుళ్ళ గుట్ట దేవాలయ అభివృద్ధికి అనేకమార్లు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినప్పటికి.. ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదని, రా ష్టంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం వందరోజుల అనతి కాలంలోనే రెండు కోట్ల నిధులతో మచ్చ పేట గ్రామం నుండి బహుళ్ళగుట్ట వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్లో బహుగుళ్ల గుట్టలోని పురాతన ఆలయాలను అభివృద్ధి పరిచే విధంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి చర్యలు చేపడతామని గతంలోనే తెలిపారని అన్నారు. మంథని నియోజకవర్గంలో అనేక విధాలుగా అభివృద్ధి చెందాలంటే అది శ్రీధర్ బాబుతోనే సాధ్య మవుతుందని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పనులు పూర్తయిన సందర్భంగా గ్రామ ప్రజల పక్షాన ఐటి శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం సాయింత్రం రామగుండం తబితా ఆశ్రమంలో ఉన్న నిస్సహాయు పిల్లలకు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు నాయకులు , ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.డి.అన్వర్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్ లు హాజరై మాట్లాడుతూ వారికి ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.మన భారతదేశం ప్రజాస్వామ్యదేశమని ఇక్కడ అన్ని మతాల వారు కలసి జీవిస్తారని, ముస్లింలకు మన దేశంలో ప్రత్యేక ఆదరణ ఉందని, హిందువుల పండగలకు ముస్లింలు, ముస్లింల పండగకు హిందువులు మరియు ఇతర మతాలవారు హాజరై కలిసుంటారనీ అన్నారు.నిస్సహాయక పిల్లలమధ్య ఇఫ్తార్ విందు ఏర్పుటు చేయడం చాల గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు.అనంతరం మద్దెల దినేష్ మాట్లడుతూ మొదటి నుండి అన్ని పండగలు తబితా ఆశ్రమంలోని పిల్లల మధ్యలో జరుపుకోవడం జరగుతుందన్నారు. పిల్లలందరికీ అండగా నిలవాలను, పిల్లలకు ఇఫ్తార్ విందు ఎర్పాటు చెయడం చాల సంతోషంగా ఉందన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో కొమ్మ చందు యాదవ్, దసారపు రాజేంద్ర ప్రసాద్, టి. రమేష్ కుమార్, నరేంద్ర,ముజహిద్, అజ్మల, హైదర్, తాజ్, వాసిం తో పాటు ఆశ్రమ నిర్వహకులు వీరేంద్ర పాల్గొన్నారు.

## జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ రామగిరి :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల నుండి రత్నాపూర్ రోడ్డు ఫోర్ లైన్స్ రహదారి నిర్మాణం జరుగుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆర్ అండ్ బి అధికారులుపట్టించుకోక పోవడం పట్ల దుమ్ము ధూళితో ప్రజలు అనేకమైన రోగాల బారిన పడుతున్నారని రోడ్డు పనులకు అధికారుల పర్యవేక్షణ లేదనీ సోమవారం పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ కు రామగిరి బిజెపి మండల శాఖ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ పటేల్ ఫిర్యాదు చేశారు .ఈ రోడ్ పనుల ద్వారా దుమ్ము ధూళితో వాహనాదారులు వ్యాపారవేత్తలు సింగరేణి కార్మిక కుటుంబాలు ఆస్పటల్ పాలవుతున్నారని అయినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తడంలేదని దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కనీసం వాటర్ కూడా చల్లడం లేదని దీనిపైన సమగ్ర విచారణ జరిపించి దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ పై అధికారి పై చర్యలు తీసుకోవాలని రామగిరి మండల బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ శ్రీధర్ అదనపు కలెక్టర్కు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కళాశాల పైన వెంటనే చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా వ్యాపారం చేస్తూ ర్యాంకుల కోసం కార్పొరేటు విద్యాసంస్థలు ఎంసెట్ క్లాస్ ల పేరుతో రూల్స్ కి విరుద్ధంగా వేసవి సెలవుల్లో సెకండ్ ఇయర్ క్లాసులు నడుపుతూ అకాడమీకి ఇయర్ ప్రారంభానికి ముందే సెలబస్ కంప్లీట్ చేయాలనె ఉద్దేశంతో విద్యార్థుల యొక్క మానసిక శారీరక స్థితిని దృష్టిలో ఉంచుకోకుండా సెలవుల్లో కూడా గంటల తరబడి క్లాసుల పేరిట మానసికంగా విద్యార్థులను హింసిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు అజయ్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ క్లాసులకు అటెండ్ కాకపోతే చదువులో వెనుకపడతారని భయభ్రాంతులకు గురి చేస్తూ తల్లిదండ్రులను కూడా మభ్యపెట్టి విద్యార్థుల పట్ల కార్పొరేట్ కళాశాల యాజమాన్యం చలామణి అవుతుందని అన్నారు. నోటిఫికేషన్ రాక ముందే 90 శాతానికి పైగా తీసుకున్నటువంటి అడ్మిషన్స్ మొత్తం రద్దు చేయాలన్నారు, వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజులను నియంత్రించాలని అజయ్ డిమాండ్ చేశారు.

## సమాధిల స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మంథని :** మంథని పట్టణంలో ప్రభుత్వం క్రైస్తవుల సమాధుల కోసం కేటాయించిన స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.సోమవారం మంథనిలోని మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో క్రైస్తవుల సమాధుల కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందని, ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారని వారు తెలిపారు. అలాగే ఆ స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.25లక్షల నిదులు మంజూరీ చేయాలని కోరారు. కాగా వినతి పత్రం స్వీకరించిన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ క్రైస్తవుల సమాధుల స్థలాన్ని ఎవరు ఆక్రమించుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సమాదుల స్థల అభివృద్ధి కమిటి అధ్యక్షులు ఐతు ఎలీషా, ప్రధాన కార్యదర్శి వల్లూరిప్రబాకర్, కోషాధికారి నతానియల్, ఉపాధ్యక్షులు తామస్, సహయ కార్యదర్శి అజ్మీరా దయారాజుతో పాటు పాస్టర్లు శ్రీనివాస్, కృపాకర్, డేవిడ్, నవీన్, రాజేష్, జోసఫ్, సంఘ పెద్దలు అంకరి కుమార్, మంథని ప్రసాద్, అందే రమేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ప్రజాపక్షం/హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం శాలపల్లి ఇందిరానగర్ కాలనీలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు రవీందర్(42)గా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/సోన్ : మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని యువకునికి గాయాలయ్యాయని ఎస్సై సంతోషం రవీందర్ సోమవారం తెలిపారు.వీరి కథనం ప్రకారం సోన్ గ్రామానికి చెందిన తోపారం సాయి ప్రసన్న అనే యువకుడు ఆదివారం సాయంత్రం నిర్మల్ వైపు నుండి సోన్ కు వెళ్లున్నాడు. రాంగ్ రూట్ లో వస్తున్న టివిఎస్18డి1678 అనే ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయి ప్రసన్న తలకు బలమైన గాయమైంది చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాద్ తరలించారు.బాధితుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పోయిన ట్రాక్టర్ దొంగ అరెస్ట్

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఈ నెల ఆరవ తేదీ రాత్రి దొంగిలించుకుపోయిన ట్రాక్టర్ను,స్థానిక పోలీసులు ఎస్ఐ లింబాద్రి ఆధ్వర్యంలో,చాకచక్యంగా వ్యవహరించి, దొంగను దొరకబట్టి,ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం,ఆరవ తేదీ ఖానాపూర్ మున్సిపాలిటీ లోని గాంధీ నగర్ లో మహేందర్ అనే వ్యక్తి ,తన ట్రాక్టర్ తో పని అయిపోయిన అనంతరం,తన ఇంటి వెనకాల రాత్రి పార్కు చేసి పెట్టగా దొంగలు దానిని ఎత్తుకుపోయారు. ఫిర్యాదు మేరకు హుటాహుటిన స్పందించిన పోలీసు సిబ్బంది, నిందితుడిని అనతి కాలంలోనే అదుపులోకి తీసుకున్నారు.దర్యాప్తులో భాగంగా, జగిత్యాల జిల్లాగా గుర్తించి, అతనిని అదుపులోకి తీసుకొని కడెం మండలం మద్దిపడగ గ్రామంలో దాచి ఉంచిన ట్రాక్టర్ను రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ లింబాద్రి, కానిస్టేబుల్స్, మహేష్, భీమేష్లను సిఐ సైదారావు అభినందించారు.

## ప్రమాదవశత్తు బావిలో పడి మహిళా మృతి

ప్రజాపక్షం/కడెం : మండలంలోని పెద్దూర్ తండాలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన మహిళ మృతి పోలీసుల కథనం ప్రకారం హపావత్ నీల(29) పొలం వద్ద విద్యుత్ మోటర్ యొక్క స్టార్టర్ ఆఫ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది,నీల మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు కలుముకున్నాయి.

## ప్రజలలో భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్

ప్రజాపక్షం/దిలావర్పూర్ : రానున్న కేంద్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలలో భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు గ్రామీణ సిఐ శ్రీనివాస్ తెలిపారు.మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సుమాంజలి,స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా

### జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ప్రజాపక్షం/ జైనూర్ : వేసవి కాలం పూర్తయ్యే వరకు ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లాలోని జైనూర్ మండలం శివ్నూర్, దుబ్బగూడ గ్రామ పంచాయతీలలో పర్యటించి త్రాగునీటి సరఫరా చర్యలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం ద్వారా జిల్లాలోని ప్రతి ఇంటికి వేసవికాలం పూర్తయ్యే వరకు త్రాగునీరు సరఫరా చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జైనూర్, సిర్పూర్, లింగాపూర్ మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, ఎ.ఇ.లు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వేసవి త్రాగునీటి ప్రణాళిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నిరంతరంగా నీరు సరఫరా చేసేందుకు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని, నీటి సరఫరాలో సమస్యలు తలెత్తినట్లయితే త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మిషన్ భగీరథ పథకం క్రింద జిల్లాలో జరుగుతున్న నీటి సరఫరాపై ప్రతి రోజు నివేదిక అం దించాలని, ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, పవర్బోర్స్ పాయింట్ల ద్వారా సరిపడా నీటిని అందించడంతో పాటు మిషన్ భగీరథ, బోర్వెల్ ద్వారా నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని, స్థానిక నీటి వనరులను గుర్తించి నీటిని పరీక్షించి తాగేందుకు అనువుగా ఉండే వాటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పైప్ లైన్ల లీకేజీ సమస్యలు, బోర్వెల్ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి నీటి సరఫరాను పునఃరుద్ధరించేలా త్వరితగతిన పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి



అదనపు కలెక్టర్ పూజారి గౌతమి స్వీప్ ఆద్వర్యంలో సిరిసిల్లలో 2కే రన్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : అర్హులైన వారందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పిలుపునిచ్చారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు స్వీప్ SYSTAMTIC VOTER EDUCATION AND ELECTRORAL PARTICIPATION ఆధ్వర్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఐ ఓట్ ఫర్ ష్యూర్ పేరిట 2కె రన్ ను అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు చేపట్టగా, సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జెండా ఊపి రన్ ను అదనపు కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. భారత రాజ్యాంగము కల్పించిన ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ హక్కును వినియోగించుకావాలని పేర్కొన్నారు. అనంతరం సిరిసిల్ల ఆర్డీఓ రమేష్ మాట్లాడారు. వోటర్ హెల్ప్ లైన్ యాప్ విహెచ్ఏ లో అందుబాటులో ఉన్న సేవలు, ఓటు హక్కు నమోదుకు అర్హత వయసు, ఆన్లైన్, ఆఫ్ లైన్ లో ఓటు హక్కు ఎలా నమోదు చేయాలి, ఫారం నెంబర్ 6 వినియోగం, ఈ ఏడాది 31వ మార్చి తేదీ వరకు 18 సంవత్సరాల నిండిన వారు ఓటును నమోదు చూసుకోవాలని సూచించారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటు హక్కు వినియోగించు కునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. యువత కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకావాలని సూచించారు. ఈ 2 కే రన్ లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మోహినొద్దిన్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీఓ గొట్టే శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారి రాందాస్, పెన్షన్ ఏపీఓ పాపారావు, నియోజక వర్గంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఉన్నారు.

## ఎంపి ఎన్నికలకు మరోసారి ఎన్ఎస్యుఐ సంసిద్ధం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఎన్ఎస్యుఐ సైనికులు ఏ విధంగా పని చేశామో.. అదే విధంగా కేంద్రంలోనూ రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పనిచేయడానికి సంసిద్ధమవ్వాలని ఎన్ఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. కరీంనగర్లోని డిసిసి కార్యాలయంలో ఎన్ఎస్యు ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంటు సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో ఎన్ఎస్యుఐ పాత్ర ఉందని సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు చెప్పారని, అందుకే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఎన్ఎస్యుఐ పక్షాన తనను ప్రతినిధిగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ పదవి కంటే నాకున్న అతిపెద్ద బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తగా ఉండన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుండగా ప్రజలు పార్టీ పట్ల సంతృప్తిగా ఉన్నారన్నారు. మతవిద్వేషాలు, దేవుడి పేరుతో రాజకీయాలు చేసే కరీంనగర్ బిజెపి పార్లమెంటు అభ్యర్థి బండి సంజయ్కు తగిన గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బండిని మాయం చేయకపోతే కరీంనగర్ అభివృద్ధి జరగదని, యువకులకు ఉద్యోగాలు రావన్నారు. తాము కూడా హిందువులమేనని, ఉదయం లేవగానే దేవుడిని మొక్కుతామని తెలపాలన్నారు. ఏ దేవుడిని ఎప్పుడు మొక్కాలి నిర్ణయించుకునే స్వేచ్ఛ తమకుంటుందన్నారు. బిజెపి నాయకుల మాదిరి ఈ దేవుడికే మొక్కాలి.. ఇదే తినాలి అనే రకం కాదన్నారు. పేద ప్రజల అవసరాలను చూస్తూ దేవుడిపై నమ్మకం కల్పిస్తామన్నారు. బిజెపి కేవలం దేవుడిపై రాజకీయాలు చేస్తుంది తప్ప ప్రజల అవసరాలను పట్టించుకోదన్నారు. కరోనా సమయంలో మెడిసిన్ కనిపెట్టండి అంటే గరిటెతో పల్లంపై కొట్టాలని మోడీ పిలుపునిస్తే అందరూ కొట్టారని, మోడీ చెప్తే ప్రజలు ఎలా వింటారో టెస్ట్ చేసుకున్నాడన్నారు. నార్త్ కొరియా కిమ్ జాన్ తను ఎలా హెయిర్ స్టైల్ చేసుకుంటే అలాగే చేయించుకోవాలని, ఏం తింటే అదే తినాలి అనే నియంతృత్వ పాలన చేశారో మోడీ ఇక్కడ ప్రజలను అలాగే పరిపాలించాలని అనుకుంటున్నారన్నారు. బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రధాన దేవాలయాలైన ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయానికి, కొండగట్టు అంజన్న ఆలయానికి, వేములవాడ రాజన్న గుడికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. ఊరికే మతంపై యువకులను ప్రజలను రెచ్చగొట్టడం మానేయాలన్నారు. కరీంనగర్లో కాంగ్రెస్ ప్రకటించే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ జిల్లా ఎన్ఎస్యు అధ్యక్షుడు మునిగంటి అనిల్ కుమార అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు, పార్లమెంటు, అసెంబ్లీ ఇంచార్జిలు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్ర ఏర్పాటు



ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి వచ్చేభక్తులు, ప్రయాణీకుల దాహార్తి తీర్చడానికి తిప్పాపూర్ ప్రధాన బస్టాండ్ నందు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శ్రీరామ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు కత్రోజ్ అశోక్ అందించిన సహకారంతో సోమవారం రోజు ప్రారంభించారు. మండుతున్న ఎండల్లో ప్రయాణిస్తూ వచ్చి గొంతు తడుకోవాలంటే పలు దిక్కులు చూడాల్సిన అవసరం లేకుండా ప్రయాణం చేసి బస్సు దిగగానే దాహం తీర్చుకోవడానికి భక్తుల సౌకర్యార్థం మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని డిపో మేనేజర్ చేరాల మురళీకృష్ణ ప్రారంభించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. డిపో మేనేజర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని, అంగవైకల్యం గలవారికి బాస్ పాసులు ఇప్పించడం, బస్ స్టేషన్ నందు బేబీ ఫీఫింగ్ సెంటర్ ఏర్పాటుతో పాటు గత 3 సంవత్సరాల నుండి ప్రయాణీకులకు, భక్తులకు బస్టాండ్ నందు చలివేంద్రం ఏర్పాటు చేసి ఎంతోమంది దాహార్తి తీరుస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ సభ్యులు గౌంగళ్ళ రవికుమార్ మాట్లాడుతూ గత 3 సంవత్సరాల నుండి ఎండాకాలంలో బస్ స్టేషన్ బయట చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రయాణీకులకు, భక్తులకు మినరల్ వాటర్ అందించడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించిన డిపో మేనేజర్ మురళీకృష్ణ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, గౌంగళ్ళ రవికుమార్, పాత సంతోష్, ప్రతాప నటరాజు, అసిస్టెంట్ మేనేజర్ బి.వర్ధిలాల్, పిఆర్ఓ శ్రీనివాస్ యాదవ్, అంజి, శ్రీనివాస్, సూపరింటెండెంట్ సత్యనారాయణ,శిరీష, ఆర్ఎల్ రాజం పాల్గొన్నారు.

## నేటి నుండి సరస్వతి కెనాల్కు సాగునీరు విడుదల

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎస్సారెస్పీ ప్రాజెక్టు సరస్వతి కెనాల్ కింద సాగు చేస్తున్న రైతులు ఆందోళన చేయిందని,పంట పొలాలకు నేటి నుంచి నీళ్ల విడుదల చేస్తామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.మహేశ్వర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ రైతులకు సాగు నీటి విడుదల కోసం ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శితో మాట్లాడి,ఎస్సారెస్పీ నుంచి 8 టీఎంసీల నీటిని ఇక్కడి నుంచి తీసుకెళ్లారని,చేతికొచ్చిన పంట ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆవేదన 42 ముంపు గ్రామాలు వ్యవసాయం మీదే బతుకుదెరువు అని అధికారులపై ఆగ్రహం చెంది నీటి విడుదలకు ఒప్పించి రైతుల కోసం సరస్వతి కెనాల్ నీళ్ల విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. సరస్వతి కెనాల్ ద్వారా 6టీఎంసీల నీరు అలాట్ చేస్తే కేవలం నాలుగున్నర టీఎంసీల నీరు మాత్రమే ఇచ్చారు.ప్రాజెక్టు ఎండిపోయిందని మిగతాటీఎంసీన్నర నీరు ఇవ్వలేదు ఇలా..ఉత్తర తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు మంత్రి శ్రీధర్ బాబు తీరుతో అన్నదాతలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.ఎస్సారెస్పీ ముంపు గ్రామాలకు కూడా నీరివ్వడం లేదు. పంటలు ఎండినష్టపోయి,రైతులు అప్పులపాలవుతున్నారు.అన్నదాతల దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యం,అధికారుల అలసత్వమే కారణం అని రైతుల పక్షాన వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కో మంత్రిది ఒక్కో తీరు గత ప్రభుత్వం లెక్కే కాంగ్రెస్ కూడా దోచుకోవడం, దాచుకోవడం తప్ప రైతులకు ఒరిగిందేమి లేదని అన్నారు.ఈ మీడియా సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు,ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్,బీజేపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సరఫరాలో సమస్యలు ఉంటే చెప్పండి

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మున్సిపాలిటీలో,మంచినీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్ని మున్సిపల్ కమిషనర్ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో,తాగునీటి సమస్య రాకుండా,అన్ని చర్యలు చేపడుతున్నామని,దీనికోసం టోల్ ఫ్రీ నెంబర్ 9666606307 ఏర్పాటు చేశామని, సరఫరాలో ఎటువంటి సమస్య ఉన్న,తమకు తెలియజేయాలని కోరారు.